
# వార్ధక్యం

చంద్రశేఖర్. బి.



సీతాదేవి ఆలోచిస్తూనే ఉంది. ఒకరోజు కాదు... రెండు రోజులు కాదు వారం రోజులు గడిచిపోయాయి. గంటలు గడుస్తున్నా కొద్దీ ఆమె గుండె బరువెక్కసాగింది. "ఇదిగో" వస్తానని చెప్పి వెళ్ళిన వాడు ఇంతవరకు రాలేదు. వస్తున్నట్టు కబురూ లేదు. ఎదురుచూస్తూనే ఉంది. కళ్ళు కాయలు కాస్తున్నాయి. ఆమెకు కొడుకు వచ్చే సూచనలు కనిపించడం లేదు.

మంచంపై పడుకున్న భర్త రామరాజు వైపు చూసింది. ముడతలు పడిన ముఖం. అతని వయస్సు అరవై పైబడి ఉంటుందనే విషయం ముఖం చూస్తే ఇట్టే చెప్పేయవచ్చు. అతనింకా నిద్ర లేవలేదు. కాలుకి పెద్ద బ్యాండేజీ ఉంది. వెల్లకిలా పడుకున్నాడు. కాలు కదిపేందుకు వీలు లేకుండా ఉంది. భర్తను చూసి సీతాదేవి మనసు ఆర్ద్రమైంది. సరిగ్గా వారం రోజుల క్రితం రామరాజు బాత్రూమ్‌లో కాలుజారి పడ్డాడు. మోకాలు విరిగింది. హాస్పిటల్‌లో చేర్చారు. డాక్టర్ సిమెంట్ కట్టు కట్టాడు. రెండు నెలల వరకు బెడ్ మీద ఉండాలన్నారు. డాక్టర్‌కు కొంత ఫీజు ఇచ్చి మిగతా డబ్బు తీసుకు వస్తానని చెప్పి వెళ్ళిన కొడుకు ఇంతవరకు రాలేదు. వార్డు రెంట్ కూడా కట్టలేదు. అతని జాడ కూడా లేదు.

డాక్టర్ తనిఖీ కొచ్చే వేళయింది. సీతాదేవి గుండె వేగంగా కొట్టుకోసాగింది. "ఇదిగో... ఇదిగో..." అని ఇంతవరకు కాలం వెళ్ళబుచ్చింది. కానీ ఈ రోజు ఏం చెప్పినా డాక్టరు వినడు. ఏం చేయాలో తోచడం లేదు. "వయసులో ఉన్నప్పుడు ఎన్నో బాధలు పడ్డాం. ఫర్వాలేదు. కానీ ఈ ముసలితనంలో బాధలేమిట్రా భగవంతుడా" అనుకొంది మనసులో.

డాక్టర్ పక్క వార్డుకొచ్చాడు. సీతాదేవి గుండె ఝల్లుమంది. ఆందోళనతో ఏమీ తోచడం లేదు. కాలు కాలిన పిల్లిలా అటు ఇటు తిరుగుతోంది.

ఒళ్ళంతా చెమటలు పట్టాయి. డాక్టర్ వచ్చాడు. సీతాదేవి నిలుచుంది నేలచూపులు చూస్తూ. పేషంట్‌ని తేరిపార చూసి "ఏమ్మా! మీ అబ్బాయి వచ్చాడా?" అన్నాడు.

సీతాదేవి తుళ్ళిపడి కళ్ళజోడు సర్దుకుని "వస్తాడండి" అన్నది వణికే గొంతుతో.

"నే నడిగింది అది కాదమ్మా... వచ్చాడా? లేదా?" అన్నాడు రెట్టించి.

"రాలేదు డాక్టర్!" అంది విచారంగా.

"సిమెంట్ కట్టు వేసిన తర్వాత మందులు బాగా వాడాలి. లేకపోతే చాలా ప్రమాదం" అన్నాడు. ఫీజు ఇవ్వకపోవడం పేషంట్‌కి ప్రమాదం అనే విషయాన్ని పరోక్షంగా చెప్పాడు. పేషంట్ వైపు తేరిపార చూసి అసహనంగా కదిలాడు డాక్టర్.

డాక్టర్ వెంట వచ్చిన నర్సు మాత్రం కదలేదు.

"సిమెంట్ కట్టు కట్టినందుకు డాక్టర్‌కు ఫీజు ఇవ్వలేదు. మీరు ఉన్న గదికి వారం

రోజులుగా అద్దె కట్టలేదు. మీ అబ్బాయి వస్తాడో, రాడో మాకు అనవసరం. సాయంత్రానికల్లా బిల్లు చెల్లించకపోతే పేషంట్‌ని వరండాలో పడేస్తారు. తర్వాత మీ ఇష్టం" ఖండితంగా అంది నర్సు.

సీతాదేవి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. దుఃఖం ఆపుకోలేకపోయింది. భర్త పక్కనే బెడ్ మీద కూర్చుని చిన్నగా ఏడుస్తోంది. రామరాజు కదిలాడు. కళ్ళు తెరిచాడు. సీతాదేవి కళ్ళలో నీళ్ళు చూసి కంగారుపడ్డాడు.

"ఏమైంది సీతా?" అడిగాడు మెల్లగా.

"అబ్బాయి రాలేదండీ" అంది ఏడుపు ఆపి.

"అంతేకదా! ఆ మాత్రం దానికే ఏడుపెందుకు?"

"వాడిప్పుడు రాకపోతే ఎలాగండీ?"

"ఏమవుతుంది?" రామరాజు నుదురు చిట్లించాడు.

"సాయంత్రం లోగా డబ్బు కట్టకపోతే వరండాలో పడేస్తామని సీరియస్‌గా చెప్పిందండి నర్సు."

"వాళ్ళు అలాగే అంటారులే..." మామూలుగా అన్నాడు రామరాజు.

"వాడు రాలేదు సరే... కనీసం కోడలు కూడా రాలేదు చూడండి."

"ఎందుకొస్తుంది. రౌతు కొద్దీ గుర్రము..."

"ఏమిటో మీ మాటలు నా కేమీ అర్థం కావడం లేదు."

"మనమింత ఆపదలో ఉన్నామంటే కారణం వాడు కదూ?"

"వాడు కారణమా! అదేమిటి!" అన్నాడు ఆశ్చర్యంగా.

"మీ కళ్ళ అద్దాలు మార్చమని మూడు నెలల నుండి చెబుతున్నా వాడు పట్టించుకోలేదు. పైగా ఖర్చట. వాడి కొడుక్కి సైకిలు కొంటే ఖర్చు కాదా? వాడు అప్పుడే కళ్ళద్దాలు కొని ఉంటే మీరు కాలుజారి పడేవారా? ఇంత ప్రమాదం జరిగేదా?"

"వాడన్నదీ నిజమే సీతా! మనకు పెట్టే ఖర్చుకి రాబడి ఉండదు. వాడి కొడుకుకు పెట్టే ప్రతి పైసాకి రాబడి ఉంటుంది."

"కన్నవాళ్ళకు అయ్యే ఖర్చుకి లాభనష్టాలు చూడాలంటారా?"

"తప్పదు సీతా... లోకమంతా డబ్బుమయం అయిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రతి పైసాకి రాబడి చూస్తారు."

"అదంతే... ఎవర్నీ నిందించలేం..."

"తల్లీ... తండ్రీ... అనే బంధాలకు అర్థం ఏమిటండీ?"

"ఇంకా ఎక్కడున్నావ్ సీతా... వాటి నిర్వచనాలెప్పుడో మారిపోయాయి. మంచికి, మానవత్వానికి విలువ ఉన్న రోజుల్లోని మాటలవి. ఇప్పుడు వాటి స్థానాన్ని డబ్బు ఆక్రమించింది. దానితో మానవతా విలువల నిర్వచనాలు మారిపోయాయి. మారుతున్న కాలంతో పాటే మనమూ మారకపోతే మనుగడ సాగించలేము..." బాధతో అన్నాడు రామరాజు.

"చిన్నప్పటి నుండి పెంచి పెద్దచేశాం. విద్యాబుద్ధులు నేర్పించాం. వాడినో ప్రయోజకుడిగా తీర్చిదిద్దాం. ఇదంతా ఎందుకు చేసినట్టు?"

"అది నీ బాధ్యత..."

"తల్లిదండ్రిని చూడాల్సిన బాధ్యత వాళ్ళకు లేదా?"

"ఉందని వాళ్ళనుకోవాలి. ఈ కాలం పిల్లలు అలా అనుకోవడం లేదు. కాబట్టి మనం మారాలి. వాళ్ళపై ఆధారపడటం మానెయ్యాలి. కంప్యూటర్ యుగంలో అడుగుపెట్టినా మన ఆలోచనా విధానం మారలేదు. ఈ విషయంలో మనం పశుపక్ష్యాదుల్ని చూసి నేర్చుకోవాలి. అవి మన లాగే పిల్లల్ని పెంచి పెద్దచేస్తాయి. రెక్కలు వచ్చి పిల్లలు ఎగిరిపోతే సంగతేమిటి అని అడగవు, బాధపడవు" అని చెప్పాడు రామరాజు.



"పిల్లల్ని చిన్నప్పుడే వదిలేశామా?"

"వదిలివేయలేం. అది మన గొప్ప కాదు. మనకు తెలియకుండానే కొన్ని పనులు చేస్తాం. ప్రకృతి మనచేత అలా చేయిస్తోంది. చెట్టుకు చిగురుటాకు మీద ఉన్న శ్రద్ధ పండుటాకు మీద ఉండదు. సృష్టి తన కార్యక్రమ నిర్వహణలో అవసరమైన దానిని ఉంచి, అనవసరమైన వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగించుకుంటూ పోతుంది. అది ప్రకృతిధర్మం..."

భర్త ఎంత చెప్పినా సీతాదేవి మనసులో ఏదో వెలితిగా ఉంది. "మనం పుత్రుడు అనుకున్నాం కానీ వాడు మనకు శత్రువండి!" అంది ఉన్నట్టుండి ఒకేసారిగా.

రామరాజు చిన్నగా నవ్వాడు.

"శత్రువు వాడు కాదు సీతాదేవీ. మన వార్థక్యమే మనకు నిజమైన శత్రువు. వార్థక్యం రాగానే మన కాళ్ళూ... చేతులు... అన్నీ శరీరంలో అన్ని భాగాలు ఎదురుతిరుగుతాయి. చెప్పినట్టు వినకుండా మొరాయిస్తాయి. బాధలుపడతాం. అనేక ఇబ్బందులకు గురి అవుతాం. వీటన్నిటికీ మూలకారణం వార్థక్యమేనని తెలుసుకోకుండా, మన పిల్లల్ని, అయినవాళ్ళని, కానివాళ్ళని నిందించడం ప్రారంభిస్తాం. అది పొరపాటు. మనం ఆ శత్రువునే ఎదుర్కొనే మార్గం చూడాలి. అప్పుడే మన సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి" అన్నాడు గంభీరంగా.

గీతాసారాన్ని బోధిస్తూ కృష్ణ భగవానుడిలా కనిపించాడు. అతని సవరణ నూటికి నూరుపాళ్ళు నిజమనిపించింది. సీతాదేవికి ఆత్మస్థైర్యం కలిగింది. మనసుకు కొంత తేలిక కనిపించింది. భర్త ఎన్ని చెప్పినా ఆమెను ఒక సందేహం వదలలేదు.

"మీరు చెప్పినదంతా నిజమేనండి కాదనను. కానీ మనం ఆపదలో ఉన్నాం. ముందీ ఆపద నుండి గట్టెక్కడమెలా?" అన్నదామె నిట్టూరుస్తూ.

రామరాజు చిరునవ్వు నవ్వి "ఇంత చెప్పినవాడిని ఆమాత్రం ముందుగా ఊహించలేనా? పదిహేను సంవత్సరాల క్రితం పది వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాను. ఆ విషయం నీకు కూడా చెప్పలేదు. అదిప్పుడు సుమారు నలభై వేలు అవుతుంది. రేపటితో గడువు తీరిపోతుంది. వెళ్ళి తీసుకోవచ్చు" అన్నాడు.

"నిజమా...!" అన్నది ఆశ్చర్యంగా.

"నిజమే సీతా... ఎప్పటికైనా పనికొస్తుందని వేశాను. అది ఈనాటికి పనికొచ్చింది. మనమే కాదు, ఈ రోజుల్లో ప్రతి తల్లిదండ్రీ పిల్లల భవిష్యత్తుతో పాటు తమ భవిష్యత్తు గురించి ముందుగానే ఆలోచించి, అందుకు తగినట్లు ప్లాన్ చేసుకోవాలి" అన్నాడు.

"అబ్బాయికి తెలిస్తే మోసం చేశామనుకోడూ" సందేహంగా అన్నదామె.

"మరి వాడు చేసింది మోసం కాదా... అయినా ఇందులో మోసం ఏముంది? వాడికి విద్యాబుద్ధులు నేర్పించాం. ఉద్యోగం చేస్తున్నాడు. ఓ ఇంటివాడయ్యాడు. ఇంకా ఏం కావాలి!" అన్నాడు.

సీతాదేవి భారంగా నిట్టూర్చింది.